# పగటి వేషాలు

"ఒరేయ్! పగటి వేషగాళ్లొచ్చార్రో" కేక వేశాడు బాబిగాడు. తమ్ముడు విశ్వం, చెల్లెలు లలిత ఆడుకొంటున్న వాళ్ళల్లా లగెత్తుకువచ్చారు.

లలిత గబగబా ఇంట్లోకి వెళ్లింది వాళ్ళక్కయ్య జానకిని పిలవడానికి. జానకీ, బావా ఒక గదిలోనే వున్నారు. లలితకు అవేమీ తెలియవు. గబాలున తలుపు తీసుకొని లోపలికి జొరబడింది. ఆశ్చర్యంగా కళ్ళన్నీ పెద్దవి చేసేసి ఏదో పెద్ద బ్రహ్మాండం బ్రద్దలయ్యేటంతటి విషయం చెపుతున్నట్లుగా మొఖం పెట్టి "అక్కా! పగటివేషగాళ్లొచ్చారే. ఎంత బాగా వేషం వేశారనుకున్నావు? చూద్దూ గాని రావే" అంటూ చెయ్యిపట్టుకొని లాగింది.

జానకి "నిజంగానా!" అంటూ చెల్లెలి వెంట వాకిట్లోకి బయలుదేరింది. బాబిగాడు వాళ్ళను వివిధరకాలైన ప్రశ్నలు వర్షం కురిపిస్తూ, ఆడిస్తూ, ఏడిపిస్తున్నాడు. వేషగాళ్ళు పాపం వాడి ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదు. బాబిగాడి ముందు వాళ్ళ ఆటలేమీ సాగడంలేదు. జానకి వచ్చేసరికి పగటి వేషగాళ్లు వాకిట్లో నిలబడి వున్నారు. మొత్తం ఇద్దరు. దాంట్లో పెద్దవాడికి ముప్పయి ఏళ్ళు వున్నట్లుగా కనిపిస్తున్నా యిరవై పైనకంటె ఎక్కువ వుండవు. అతను దర్జాగా కొత్త పాంటు వేశాడు. అది అప్పుడే విప్పిన ఇస్త్రీమడతలాగా వుంది. ఇంకా నలగనన్నా లేదు. చక్కటి వెస్ట్‌కోటు బనాయించేసి, నెత్తిన టోపీ పెట్టాడు. ఎక్కణ్ణుంచి వచ్చిందో గానీ, కాళ్ళకు నల్లని బూటు గూడా వేశాడు. అతని ప్రక్కన అదే వేషంలో పదకొండు, పన్నెండేళ్ళ చిన్న కుర్రాడొకడున్నాడు. జానకి వాళ్లిద్దర్నీ చూచి బుగ్గమీద వేలు వేసుకొని "వేషం ఎంత బాగా కట్టారు" అన్నది ఎంతో సంభ్రమాశ్చర్యాలతో.

"ఇకేమి చూచావె! ఇంకాక శక్తివేషం చూడలేదు. ఎంత బావుందనుకున్నావు!" అన్నాడు తనే చూచానుగదా అనే గర్వంతో బాబిగాడు.

వాకిట్లో నుంచున్న వేషగాళ్లు బాబిగాడి మాటలతో నిరుత్సాహపడి బాగా మెప్పించాలని గాబోలు ప్రసంగంలోకి దిగారు.

పెద్దఅతను చేతికఱ్ఱను త్రిప్పుతూ "సుందరరావుగారున్నారా అండీ?" అన్నాడు. అక్కడున్న పిల్లలందరూ ఘొల్లున నవ్వారు. "భలేవాడివిరా. మాబావ పేరు నీకెలా తెలిసింది?" అని నవ్వుతూ అడిగింది లలిత.

జానకి కొంచెంసేపు నవ్వి "భలేగా వుండే వేషం. మీరెవరోగాని అచ్చం దొరలకు మల్లేనే కట్టారు వేషం. అబ్బే అసలు భేదమే కనిపెట్టలేం" అంది. అంతలో తల్లి శాంతమ్మగారు కూడా అక్కడికే వచ్చింది. జానకి వాళ్లమ్మ చెయ్యిపుచ్చుకుని "చూడవే అమ్మా. వాళ్ల వేషం ఎంత దర్జాగా వుందో" అని కాస్త సిగ్గుపడుతూ "మీ అల్లుడు గారినిగూడా అడుగుతున్నారు. వీళ్ళ తెలివి చూడవే ఎక్కడ కనుక్కున్నారో మీ అల్లుడుగారొచ్చారనీ" అంది.

శాంతమ్మగారు ముక్కుమీద వేలువేసుకొని "అబ్బ! వేషగాళ్లంటే మీరు నాయనా! వేషం ఎంతబాగా వేశారు. రండి! రండికూర్చోండి. లోపలికి రండిరా" అంటూ దారి చూపించింది. వాకిట్లో వాళ్లిద్దరూ వసారాలోనికి వచ్చి అక్కడున్న కుర్చీల్లో దర్జాగా కూర్చున్నారు.

శాంతమ్మ బాబిగాణ్ణి పిలిచి "ఒరే! మీ బావను పిలవరా? చూస్తారు ఆయన గూడా!" అంది.

బాబిగాడు "పోనీవే! ఈ పల్లెటూరి పగటివేషాలే చూడాలేమిటి ఆయన. ఇక్కడే మనం వేషాలు చూస్తున్నాంగాని ఆయన అచ్చం ఇటువంటి మనుషుల్నెందర్నో రోజూ చూస్తూనేవుంటాడు" అన్నాడు విసుగ్గా.

బాబిగాడు వెళ్ళకపోవడం చూచి లలిత గబగబా వెళ్లి "దొరవేషాలొచ్చాయి బావా! చూద్దూగాని రా బావా! అమ్మ నిన్ను చూడ్డానికి రమ్మని అంటోంది" అంది.

సుందరరావు ఇంటికి కొత్తల్లుడు. అసలే సిగ్గు. అతనికి పగటివేషాలు చూడాలని లేదు. అయినా అత్తగారు మాత్రం తనవంటి బస్తీకుర్రాణ్ణి వెధవ పగటివేషాలు చూడ్డానికి చిన్నపిల్లలికిమల్లే రామనడమేమిటి? "సరేలే! వస్తున్నా పద. వస్తున్నానని చెప్పు" అని చెప్పి లలితను పంపించేసి అద్దంలో ముఖాన్ని చూచుకొంటూ తల దువ్వుకొంటూ షోకు చేసుకోవడం మొదలు పెట్టాడు.

లలిత ఒక్కర్తే వచ్చేసి మళ్ళీ వేషగాళ్ళను చూచే ప్రేక్షకులలో కలసిపోయింది. ఉన్నకొద్దీ పిల్లలు ఒక్కొక్కరే చేరుతున్నారు. వాకిటినిండా పిల్లలగుంపే. అందరూ విరగబడి వింత చూస్తున్నారు.

శాంతమ్మగారు ఆ వేషగాళ్ళను ప్రశ్నలు వేయడం మొదలుపెట్టింది.

"ఏ వూర్లో అబ్బీ మీది?"

పెద్దతను కాస్త తెల్లబోయి "మాదీవూరు గాదండీ! మా అత్తవారింటికి వచ్చాను. మీ అల్లుడుగారూ, నేనూ ఒకే చోట పనిచేస్తూ వుండేవాళ్ళం. ఆయన పనిచేసే కంపెనీలోనే నాకూ ఉద్యోగం. సుందరరావుగారితో కొద్దిగా మాట్లాడవలసిన పనివుండి వచ్చాను." అన్నాడు.

"ఓరి నీ మాటలు బంగారంగాను, ఎంత చమత్కారంగా మాట్లాడుతున్నావురా? అయితే ఏమన్నావూ? ఈ వూర్లో మీ అత్తగారున్నారటరా?" అంటూ పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వడం మొదలు పెట్టింది శాంతమ్మగారు. పిల్లలు గూడా నవ్వుతునే వున్నారు వేషగాడి మాటల్ని చూచి.

ఇద్దర్లోనూ చిన్న వేషగాడు బిక్క మొఖం వేసేశాడు అంతమంది పిల్లల్ని చూచి బెదిరిపోయి. పిల్లలంతా అతని చుట్టూ చేరి "ఒరే! లిల్లీపుట్! నీవు మాట్లాడవేమిరా?" అంటూ వాణ్ని లంకించుకొన్నారు.

పెద్దతనికి తన కుర్రాణ్ణి ఏడిపించడానికి పూనుకొనేసరికి అతని ముఖమంతా జేవురించింది. కాస్త విసుగ్గా పిల్లల్ని అదలిస్తూ "ఏమండోయ్! ఉంటే ఉన్నాడని చెప్పండి. లేకపోతే లేడని చెప్పండి" అన్నాడు. శాంతమ్మగారు చూస్తూ వూరుకోంది ఇంకేం తమాషాగా మాట్లాడతాడో చూడాలని. అతను ఇంకా విసుగ్గా "అసలు సోమసుందరరావు గారు మీ అల్లుడేనా?" అన్నాడు.

శాంతమ్మగారు మరింత నవ్వుతూ కూతురితో "ఒసే! అమ్మాయీ చూడవే ఎంత నవ్వొచ్చేటట్లుగా మాట్లాడుతున్నాడో!

అసలు నాటకాల్లో వేషాలేసేవాళ్లు గూడా ఇలాగే వుంటారే! కోపంగా వుండాలన్నప్పుడు కోపం! ఏడుపొచ్చినప్పుడు ఏడుపూ, నవ్వొచ్చినప్పుడు నవ్వూ చూపించగలరు వాడిముఖంలో కోపం ఎంత ఇదిగా కనపడుతోందో చూడు" అంది తరువాత గడ్డం క్రింద చెయ్యిపెట్టుకొని "ఎంత జబర్దస్తీగా మాట్లాడావురా నాయనా! అయితే నాయనా! తెలీక అడుగుతాను: ఎల్లకాలం ఇలాగే వేషాలేస్తూ వుంటారటరా? ఈ దసరా వెళ్లిపోతే ఈపగటి వేషాలు చూచేవారుండరుగదా మరి ఎలా కాలం గడుపుతారు?" అంటూ ప్రశ్నించింది

అతను చికాకుపడ్డట్టుగా "అబ్బే మేం పగటివేషాలు వేయమండీ! నిక్షేపం లాంటి బ్రాహ్మణుల్ని పట్టుకొని, నిలువునా పగటివేషగాళ్ళని అంటున్నారేమిటి? అసలు మీ అల్లుడుంటే ఒక్కసారి రమ్మని చెప్పండి, లేకపోతే ఇప్పుడే వెళ్ళిపోతాం"

పిల్లలందరూ ఉత్సాహంగా చప్పట్లు చరిచారు వేషగాడు మాట్లాడే మాటలకు కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వుతున్నారు "సుందర్రావుతోపాటు పనిచేస్తున్నానని" చెప్పిన ఆ పగటివేషగాడి మాటలకి అందరికీ నవ్వొచ్చింది

కాంతమ్మగారు:

"నిజమేరా నాయనా! మిమ్మల్ని చూస్తే ఎవ్వరూ పగటివేషగాళ్ళనే అనుకోరు ఆఫీసర్లలాగే వున్నారు ఆ మాట్లాడే తీరెలా అలవడిందో! ఎంత నేర్పుంటే మాత్రమే! దసరా రోజుల్లో తప్ప మీ ముఖం చూచేవారెవరు నాయనా? ఇదివరకటి రోజుల్లో నయితే పెద్దపెద్ద మహారాజులే మీవంటి వాళ్ళను పోషించేవారు ఈ రోజుల్లో వాళ్లేరీ? వాళ్ళతోపాటే మీకళా నశించిపోయింది ఏదో నీవంటి వాళ్లుండి దాన్నే పట్టుకొని ప్రాకులాడుతూ వుంటారు అభిమానం చావక పాపం! ఇప్పుడు మీ ముఖాలు చూచేవారే లేరు" అంటూ వాళ్ళను ఓదార్చింది

వేషగాడు ముఖమంతా ఎఱ్ఱగా చేసుకొని, చిట్లిస్తూ "ఏమండీ! వెళ్ళిపొమ్మంటారా? ఆయన లేడల్లేవుంది ఇంట్లో" అన్నాడు కుర్చీమీద నుంచి లేచి వెళ్ళబోయాడు బాబిగాడు వెళ్లేవాళ్లను ఆపుచేసి "హాస్యాలు తరువాత మాట్లాడుకోవచ్చులేరా! ముందు గమ్మత్తయినపాట పాడు" అన్నాడు


లలిత "సినిమాపాట లయితే బావుంటాయిరా! అవి పాడించరా అన్నయ్యా" అంది

పిల్లలంతా "పాటలొద్దు మాటలే బావున్నాయ్ ఇంకా మాటలే చెప్పమనండి, అంటూ గోలచేశారు బాబిగాడు "ఏదీ కాలేవోయ్! ఇది మాయిల్లు మాయింటికి వచ్చినప్పుడు మా యిష్టంవచ్చినట్లుగా పాడించుకొంటాం; మీ ఇంటికొస్తే మీరు మాటలే చెప్పించుకోండి" అన్నాడు

అందులో ఒకడు "ఇంగ్లీషు డ్యాన్సు చెయ్యమను అన్నాడు

బాబిగాడి కది నచ్చింది ఎగిరి గంతేసి "నిజమేనోయ్! ఇంగ్లీషు డ్యాన్సు చేస్తూ పాటపాడు" అన్నాడు పగటివేషగాళ్ళు ఇంతవరకూ ఆడిన నాటకం అయిపోవడంతో జానకి అక్కణ్ణించి సుందర్రావు దగ్గిరికి వెళ్ళిపోయింది

సుందర్రావు "ఎవరు వస్తా?" అన్నాడు. "ఎవరో పగటివేషగాళ్ళట ... బావున్నారండీ? పక్కా సీమదొరలకీ, వాళ్ళకీ తేడా కనిపెట్టనేలేము మీకంటె గూడా మంచిబట్టలు వేశారు చేతిలో కఱ్ఱ, కాళ్ళకు బూట్లు, కళ్లకు జోడు; ఎంత దర్జాగా వున్నారనీ! ధతేధతే మాటలు చెపుతున్నారండీ! రాగానే సిగ్గు నఖిన యిస్తూ ముందుగా ఇంటి అల్లుణ్ణే అడుగుతున్నారు" అంది ఈ క్రొత్తపద్ధతి విని "నిజంగానా" అన్నాడు సుందర్రావు ఆశ్చర్యంగా! "ధతేపద్ధతి మొదలు పెట్టారే!? అల్లుళ్ళదగ్గర గలగల్లాడుతూ



వుంటాయని కనిపెట్టే ఎత్తాను ఎత్తు. అయినా ఏమని అనుకుంటున్నారు?" అన్నాడు ఆదుర్దాగా తెలుసుకోవాలన్న కుతూహలంతో.

"ఏముందేమిటండీ? మీ పేరుపెట్టి అడిగేస్తూ వుంటేనూ! 'సుందర్రావుగారున్నారాండీ' అని మమ్మల్నడిగారు." మీతో పాటుగా మీరు పని చేసే చోటే పనిచేస్తున్నామనీ, మీతోపాటు కలిసి తిరిగేవాళ్లమనీ చెపుతున్నారు"

"భలే వేషగాళ్ళనే!? పేర్లుగూడా కనుక్కున్నారన్నమాట."

బయట పిల్లల గల్లంతు ఎక్కువైంది. బాబిగాడు పాటపాడమని బలవంతపెడుతున్నాడు. పాపం వాళ్ళకు పాటలు రావేమో ఖర్మం నోరు ఒప్పగించిచూస్తూ నిలబడిపోయారు. పిల్లలంతా కేకలు పెడుతూ గల్లంతు చేస్తున్నారు. కాంతమ్మగారు లోనికెళ్లి చేటలో బియ్యం పోసుకొని తెచ్చింది. వేషగాళ్లిద్దరూ కోపంగా కూర్చున్న కుర్చీలో నుంచి లేచారు. కాంతమ్మగారు చిరునవ్వు నవ్వుతూ "ఓరి! మీ కడుపు బంగారంగాను, బియ్యం పట్టరటరా? అవునులే దొరలు బియ్యం ఎందుకు పడతారు" అంటూ చమత్కరించి "సరేలే! డబ్బులిస్తానుండండి" అంటూ లోనికెళ్లింది. బాబిగాడూ, తక్కిన పిల్లలూ అందరూ నుంచున్న వాళ్ళను బలవంతాన కుర్చీల్లో కూలవేశారు. బాబిగాడు బ్రతిమలాడుతున్నాడు. "ఒరే! ఒక్కపాటంటే ఒక్కపాట. పోనీ డ్యాన్సు చెయ్యొద్దులే!" అన్నాడు.

ఇంతసేపటినుంచీ కబుర్లు చెపుతున్నా చేబులో రెండు డబ్బాలబియ్యమైనా లేవని వేషగాళ్ళకు కోపం వచ్చింది గాబోలు. కాంతమ్మగారు పావలాబిళ్ళ తీసుకొచ్చి ఇవ్వబోయింది. వాళ్ళిద్దరూ ఆ పావలాను తీసుకోకుండా కోపంగా పిల్లల్ని తోసుకొని బయట పడబోయారు.

కాంతమ్మగారు "ఒరే! అబ్బీ! ఆయ నింటిదగ్గర లేరురా! ఆయ నింటిదగ్గరుంటే ఇంతకంటే ఎక్కువే ఇచ్చేవారు. ఏదో దీంతోనే సంతోషపడు" అంది. పిల్లలంతా "ఒక పాట పాడించం"డని గోల పెడుతున్నారు. ఆమె పిల్లల్ని అదలిస్తూ "పోనీండి పాపం ప్రొద్దు కుంకిపోతూ వుంది. ఇంకో రెండిళ్లు తిరగొద్దూ! ఇక్కడే మీదగ్గర పాడుతూ కూర్చుంటే ఎలాగు? పాపం వాళ్ళను వెళ్ళనివ్వండి" అంది.

పెద్దవేషగాడు రోషంతో మొఖమంతా ఎఱ్ఱగా చేసుకొని "ఏమండోయ్! కాస్త మర్యాదగా మాట్లాడండి. ఇందాకట్నించీ చూస్తున్నాను మీ ధోరణి. ఏదో పగటి వేషగాళ్ళను చూచినట్లు చూస్తూ ఆడిస్తున్నారుతప్ప మర్యాదా గిర్యాదా ఏమీ లేదు. మీ అల్లుడు సుందర్రావుగారుంటే వున్నారని చెప్పడం, లేకపోతే లేరని చెప్పడం మీ ధర్మం గానీ, ఇంటికొచ్చినవాళ్ళ నిలా చేయడం ధర్మంగాదు. మీకు తగదు. సుందర్రావు గారి మొఖంచూచి ఇంతవరకూ వూరుకుంటూవచ్చాము. ఇక వెళ్లొస్తాము. పదరా" అంటూ కుర్రాణ్ని నడిపించుకొని పోతూవున్నాడు.

సుందర్రావుకి గదిలో గూడా పిల్లల కాకిగోలంతా వినపడుతూనే వుంది. జానకి బలవంతాన సుందర్రావును పగటివేషాలు చూపించడానికి బయటికి తీసుకొచ్చింది. బయటికి వచ్చేసరికి వాళ్లిద్దరూ పిల్లల గుంపును తోసుకొంటూ వెళ్లిపోతున్నారు. జానకి "ఒరే బాబిగా! వాళ్ళని పిలవరా! మీ బావగారు చూస్తారట" అంది. బాబిగాడు పిలవడం లేదు, ఏమీ లేదు. పిల్లలంతా అమాంతంగా వాళ్ళిద్దర్నీ లాక్కొచ్చారు.

సుందర్రావు వాళ్ళిద్దర్నీ చూచి నిలువునా నీరయిపోయాడు— నిర్ఘాంతపడి తటపటాయిస్తూ, 'హల్లో రామచంద్రరావుగారూ! మీరా" అన్నాడు. క్రిందికి దిగి చెయ్యందిస్తూ!

పిల్లలంతా సుందర్రావు ధోరణి చూచి శిలాప్రతిమల్లా నిలుచుండిపోయారు.

"ఏమిటండీ ఇది?" అన్నాడు సుందర్రావు. రామచంద్రరావుముఖాన కత్తివాటు కయినా నెత్తురు చుక్క లేదు. "ఏముందండీ! మీ దర్శనార్థం వచ్చినందుకు ఫలితం!" అన్నాడు.

"సుందర్రావు ఆజ్ఞ ఇవ్వగానే బాబిగాడు పిల్లలందర్నీ తరిమేశాడు. పిల్లలందరూ వెళ్లిపోగానే మహాపదనుంచి బయటపడ్డట్టు దీర్ఘమైన నిశ్వాసం విడిచాడు కుఱ్ఱాడు.

సుందర్రావు రామచంద్రరావును కుర్చీలో కూర్చోబెట్టి "ఎందుకొచ్చారు.? అసలేమిటీకథ?" అని ప్రశ్నించాడు. జానకి ఈదృశ్యం చూస్తూ నోటవెంట మాటరాక గుడ్లప్పచెప్పేసి అలా నిలుచుండిపోయింది కొంచెంసేపు. తరువాత గభాలున అక్కణ్ణించి ఇంట్లోకి పరిగెత్తింది. సుందర్రావు బాబిగాడితో "ఒరే! మీ అక్కయ్యను కాఫీ తీసుకురమ్మనరా" అని చెప్పాడు.

రామచంద్రరావు "అబ్బే! వద్దులేవోయ్!" అంటూ, చెప్పడం మొదలుపెట్టాడు.

"మా అత్తవారి వూరుగూడా ఇదేనోయ్; పండక్కి వచ్చాను. మీ అత్తవారిల్లూ ఇక్కడేనని తెలిసింది. ఆఫీసుకు శెలవు పెట్టడంవల్ల తప్పకుండా ఇక్కడే వచ్చి వుంటావనుకున్నాను. ఇంటిదగ్గర "అలా షికారుగా వెళ్ళొస్తా"మని చెప్పి బయలుదేరి ఎలాగో ఇల్లు కనుక్కొని వచ్చాం! ఇక జరిగిందేమిటో నువ్వు చూస్తూనే వున్నావుగా?" అన్నాము.

చిన్నకుఱ్ఱాడు భయపడిపోయాడల్లే వుంది "బాబోయ్! త్వరగా పద ఇంటికి వెళ్ళిపోదాం" అన్నాడు. సుందర్రావుకు నవ్వొచ్చింది గానీ నవ్వలేదు.

"అయ్యో! పాపం!" అన్నాడు సుందర్రావు. "నీవు విచారపడడం ఎందుకులే! ఈ పల్లెటూళ్లో అదిగాక ఈ దసరాపండుగరోజుల్లో ఈ లాడూబీడూ వేయడం నాది పొరపాటు గానీ, నీదేముంది." అన్నాడు

భార్య: "ఏమండీ! మా నాన్న యీవేళ వస్తున్నారు. సాయంకాలం మీరు ఆఫీసు నుంచీ వచ్చేటప్పుడు దానిమ్మ పండు ఒక్కటి పట్టుకురారూ? ఆయనకు ఆపళ్లు అంటే ఎంతో యిష్టం. ఒక్కొక్క పండుకీ ఆయన ఆస్తిలో సగం యిచ్చేస్తారు."

భర్త: "ఓహో అలాగా! అయితే రెండు పళ్లు పట్టుకొస్తానులే."


## 'హైలేర్'

బోదజ్వరములను నివారించి వాపులను పోగొట్టును. చాలమంది రోగులు దీనినివాడి మంచి ఫలితములనుపొందిరి.

1½ నెలలకు సరిపడునంతు రు. 3/-

తోలేటి ఆంజనేయులు & సన్,

నారుటేరు, ప. గో. జిల్లా.

లేనినవ్వు తెచ్చుకుంటూ!

"అయితే మీ అత్తగారి పూరిడే న్నావు. మీ మామగారి పేరేమిటి?" అన్నాడు సుందర్రావు.

"బలిజేపల్లి నాగభూషణంగారు."

తలుపుచాటునుంచీ ఈ సంభాషణంతా వింటూవున్న జానకి పెళ్లి సంగతంతా కాంతమ్మతో చెప్పింది. "అమ్మా! అతను బలిజేపల్లివారి అల్లుడటే" అంది వచ్చే నవ్వు ఆపుకొంటూ.

"అయ్యో రామ! ఎంత పని జరిగింది. పాపం చెపుతూనే వున్నాడు ఒకవేపు నుంచి" అంది విచారంగా కాంతమ్మగారు. ముఖం చెల్లక కాఫీ బాబిగాడిచేతికిచ్చి పంపించారు. తలుపుచాటునుంచి వగటి వేషగాడూ, తన అల్లుడూ మాట్లాడుకోవడం చూచి "అవ్వ!" అని నోరు నొక్కుకుంది కాంతమ్మగారు. ★


# మీరు ఖర్చుపెట్టిన డబ్బుకు ఈవిధములుగా డాల్డా వనస్పతి పూర్తిగా లాభము గలుగజేయును






వంటకు సర్వోత్తమమైనది
శక్తికి సర్వోత్తమమైనది
సీలుచేయబడిన డబ్బాలలో
ఎల్లప్పుడు క్రొత్తగా దొరకును

ఎవరు మంచి ఇల్లాలు?
ఉచిత సలహాకు ఇవ్వాళో లేక ఏరోజైనను ఈ క్రింది అడ్రసుకు వ్రాయండి:
ది డాల్డా అడ్వైజరీ సర్వీస్, పోస్టు బాక్సు నంబరు 353, బొంబాయి 1

డాల్డా ఆహారమును రుచికరముగా జేయును. డాక్టర్లచే తప్పకుండ మీ కుండాలని చెప్ప బడు శక్తినిచ్చు క్రొవ్వుపదార్థమును మీకు ఇచ్చును. మరియు ప్రత్యేకమైనటువంటియు, సీలుచేయబడినటువంటియునైన డబ్బాలో డాల్డా తప్పకుండ క్రొత్తగాను, శుద్ధముగాను మిమ్ములను చేరును. అది తయారగునపుడు చేతితో ముట్టుకొనబడదు.




## డాల్డా
అందరికి వేరువేరు సైజుల టిన్నులలో

HVM. 185-X52 TL